సాక్షి కామారెడ్డి

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



ప్రత్యామ్నాయం..

హైవే పనుల కారణంగా ఎల్లారెడ్డిలో చిరు వ్యాపారుల తాత్కాలిక షెడ్లను తొలగించారు. ప్రత్యామ్నాయం లేక వారు రోడ్డున పడ్డారు.

- IIIలో ▸



ఉపాధి కూలీలకు..

ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.2 /20.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం వేళ చల్లనిగాలులు వీస్తాయి. మధ్యాహ్నం వేళ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నవంబర్ 27న ఫిజిక్స్ జాతీయ సదస్సు



భిక్కనూరు: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నవంబర్ 27వ తేదీన నిర్వహించనున్న ఫిజిక్స్ జాతీయ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సౌత్ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కృత్రిమ మేధ యుగంలో విజ్ఞాన శాస్త్రాలకు ఉన్న అవకాశాలు – సవాళ్లు' అనే అంశంపై సదస్సులో చర్చ ఉంటుందని తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నతమండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి హాజరవుతారని, అలాగే వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు కూడా పాల్గొంటారన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సదస్సు ఇన్‌చార్జి రామకృష్ణ, ఫిజిక్స్ హెచ్‌వోడీ మోహన్‌బాబు, పాఠ్య ప్రణాళిక విభాగం చైర్మన్ హరిత, లక్కరాజు, అధ్యాపకులు లలిత, ప్రతిజ్ఞ వైశాలి, సరిత, దిలీప్, శ్రీమతి, నారాయణ, పోతన్న పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 193 దరఖాస్తులు



కామారెడ్డి రూరల్: జిల్లాలోని 49 మద్యం దుకాణాలకు మంగళవారం నాటికి 193 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి 23వ తేదీన లక్కీ డ్రా నిర్వహిస్తామన్నారు. మంగళవారం అందిన 27 దరఖాస్తులతో కలిపి ఇప్పటి వరకు ఆయా దుకాణాలకు 193 దరఖాస్తులు అందాయన్నారు. కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 15 దుకాణాలకు 54 దరఖాస్తులు, ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో 7 దుకాణాలకు 25, బాన్సువాడ స్టేషన్ పరిధిలో 9 దుకాణాలకు 44, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 దుకాణాలకు 32, బిచ్కుంద స్టేషన్ పరిధిలో 10 దుకాణాలకు 38 దరఖాస్తులు అందినట్లు ఈఎస్ వివరించారు.

గ్రీస్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: టాంకామ్ ద్వారా గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ నిర్వహణ, సేవా రంగంలో వెయ్యి చట్టబద్ధమైన ఉద్యోగాల కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎం రజనీకిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంగ్లిష్ నైపుణ్యం కలిగి ఉండాలని, ఉచిత బీమా, భోజన, వసతితోపాటు నెలకు జీతం రూ.92 వేల నుంచి రూ.లక్షా22 వేల వరకు ఉంటుందన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, డిగ్రీ ఉన్నవారు లేదా ప్రభుత్వ నైపుణ్యం ధ్రువీకరణ పొందిన వారు దరఖాస్తు చేయొచ్చన్నారు. www.tomcom.telangana.gov.inలో గానీ, 94400 52081, 94400 51452 నంబర్లకు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు..

ఎల్లారెడ్డి: జిల్లాలోని తొమ్మిది సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో 2025 – 2026 విద్యా సంవత్సరానికి 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్ల భర్తీ చేయనున్నట్లు ఎల్లారెడ్డి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించిన ప్రవేశపరీక్షకు హాజరై ఉండాలని, ఇప్పటి వరకు నిర్వహించిన ప్రవేశాల ప్రక్రియలో ఎక్కడా సీటు పొంది ఉండొద్దని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16, 17 తేదీల్లో తమ సర్టిఫికెట్లు, ప్రవేశ పరీక్ష హాల్ టికెట్ తదితర ధ్రువపత్రాలతో ఎల్లారెడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

ఆబాస్‌లో జిల్లాకు తృతీయస్థానం

కామారెడ్డి టౌన్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టం(ఆబాస్) అమలులో రాష్ట్ర స్థాయిలో జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. ఈ మేరకు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆబాస్‌ను జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సక్రమంగా అమలు చేయాలని అన్నారు. పీహెచ్‌సీలు, సబ్ సెంటర్‌లలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఆబాస్ యాప్‌లో ఆన్‌లైన్ అటెండెన్స్ మరింత పకడ్బందీగా నమోదు చేసుకొని రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో జిల్లా నిలిచేలా కృషి చేయాలని కోరారు.



ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో కార్డుల సంఖ్య పెరుగుతోంది. కార్డులకు అనుగుణంగా రేషన్ కోటా సైతం పెరుగుతున్నా.. దుకాణాల సంఖ్య మాత్రం పెరగడం లేదు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 80వేలకు పైగా కార్డులు మంజూరుకాగా, అందులో కామారెడ్డికి మంజూరైనవి 35,298 ఉన్నాయి. రేషన్ దుకాణాల సంఖ్యను పెంచితే అందరికీ సౌకర్యంగా ఉంటుందని లబ్ధిదారులు కోరుతున్నారు.

పెరిగిన రేషన్ కోటా

ఉమ్మడి జిల్లాలో కొత్త కార్డులు 80,538

- నిజామాబాద్ జిల్లాకు 45,240..
- కామారెడ్డి జిల్లాకు 35,298
- కార్డుల మంజూరుకు అనుగుణంగా పెరగని దుకాణాల సంఖ్య



కామారెడ్డి జిల్లా దేవునిపల్లి రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

దోమకొండ: ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల మంజూరు నిరంతరాయంగా సాగుతోంది. ప్రతినెలా కార్డుల మంజూరుతోపాటు కోటా సైతం పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో తీసుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. బియ్యం పంపిణీ ప్రారంభించగానే ఠంచనుగా రేషన్ దుకాణాలకు వెళ్లి తీసుకువెళ్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాకు కొత్తగా 80,538 కార్డులు మంజూరయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 4,92,806 కార్డులు ఉండగా, 16,38,839 మంది లబ్ధిదారులు ఉన్నారు. అయితే జిల్లాకు కొత్తగా 45,240 కొత్త కార్డులు మంజూరయ్యాయి. అదేవిధంగా కామారెడ్డి జిల్లాలో మొత్తం 2,88,553 రేషన్‌కార్డులు ఉండగా, 8,61,131 మంది లబ్ధిదారులు ఉన్నారు. జిల్లాకు 35,298 మందికి కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి.

రేషన్‌కార్డులకు అనుగుణంగా రేషన్ దుకాణాల సంఖ్య కూడా పెరగాల్సి ఉంది. నిజామాబాద్ జిల్లాలో కార్పొరేషన్, మున్సిపాలిటీలతోపాటు 545 గ్రామ పంచాయతీలు ఉండగా, 759 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదేవిధంగా కామారెడ్డి జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, 22 మండలాలు, 532 గ్రామ పంచాయతీల పరిధిలో 578 రేషన్ దుకాణాలు ఉన్నాయి. కాగా కొత్త గ్రామ పంచాయతీలు, వార్డులు ఏర్పాటైనప్పటికీ దుకాణాల సంఖ్య మాత్రం పెంచడం లేదు. కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో దుకాణాల సంఖ్య సైతం పెరగాల్సి ఉంది. పలు మండలాల పరిధిలో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో గోదాములు ఏర్పాటు చేసి అక్కడి నుంచి రేషన్ దుకాణాలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. కొత్తగా ఆహార భద్రత కార్డులను ప్రభుత్వం అందజేయగా సన్నబియ్యం పంపిణీ జరుగుతోంది. డీలర్లు బియ్యం ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో కార్డులకు అనుగుణంగా దుకాణాల సంఖ్య పెరిగితే తమ ఇబ్బందులు దూరం కావడంతోపాటు సమయం సైతం ఆదా అవుతుందని లబ్ధిదారులు అంటున్నారు. అధికారులు దుకాణాల సంఖ్యను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

- మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి
- అధికారులకు కలెక్టర్ సంగ్వాన్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: వారం రోజుల్లోగా భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మహమ్మద్‌నగర్, బిచ్కుంద, గాంధారి, లింగంపేట మండలాల తహసీల్దార్లతో సమావేశమై భూభారతి పెండింగ్ దరఖాస్తుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకు రావడం, రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందన్నారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించడం ద్వారా రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆయా మండలాల్లో పెండింగ్‌లో దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారం త్వరగా జరిగేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, సంబంధిత ఆర్డీవోలను ఆదేశించారు. సమావేశంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, సూపరింటెండెంట్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ జిల్లా అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల

- పార్టీని ప్రక్షాళన చేయాలని అధిష్టానం నిర్ణయించింది
- ఏఐసీసీ జిల్లా అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల

కామారెడ్డి టౌన్: పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డ వారికే పదవులు దక్కుతాయని ఏఐసీసీ జిల్లా అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పార్టీని ప్రక్షాళన చేయాలని అధిష్టానం నిర్ణయించిందని తెలిపారు. ఈ క్రమంలోనే డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. నియోజకవర్గ ముఖ్య నాయకుల అభిప్రాయాలను కరోల సేకరించారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీని ముందుకు నడిపించిన కైలాస్ శ్రీనివాస్ రావునే మళ్లీ డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలన్నారు. ఆయనని మార్చాలని నిర్ణయిస్తే ప్రభుత్వం ఏదైనా మంచి అవకాశం కల్పించిన తర్వాతే ఆయనను మారుస్తామన్నారు. ఈ మేరకు నియోజకవర్గ నాయకులు కైలాస్ శ్రీనివాస్‌ను డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని తీర్మానం చేశారు. సమావేశంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ ఇలియాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు సందీప్, పండ్ల రాజు, గోనె శ్రీనివాస్ నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వెనుకబడి ఉన్న బాన్సువాడ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాన్సువాడ మండలంలో 446 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా.. వాటిలో కేవలం 169 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే ఇప్పటి వరకు ప్రారంభమవడం సరికాదని, ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టిసారించి మిగతా 227 ఇండ్ల నిర్మాణ పనులకు మార్క్‌అవుట్ ఇచ్చి వెంటనే ప్రారంభించాలన్నారు. అలాగే బేస్మెంట్, రూమ్ లెవెల్ వరకు పూర్తయిన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేకంగా పనులు నిర్వహించాలని హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, డీపీవో మురళి తదితరులు పాల్గొన్నారు.

టీటీఐలో సౌకర్యాలు కల్పించాలి



టీటీఐ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

కామారెడ్డి క్రైం: రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రానికి సమీపంలోని ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) ఎంతో అనువుగా ఉంటుందని, సౌకర్యాలు కల్పించాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు. టీటీఐ భవనాన్ని ఎస్పీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో పట్టుబడిన వారికి సైతం కౌన్సెలింగ్ ఇచ్చేందుకు టీటీఐ భవనాన్ని వినియోగిస్తామన్నారు. ఇక్కడి విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలను కల్పించాలని రిజర్వ్‌డ్ విభాగం సీఐ సంతోష్‌కుమార్‌కు ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

పోచారం ప్రాజెక్టుకు రికార్డు స్థాయి వరద

- రెండునెలలుగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది 28 టీఎంసీల వరద



పోచారంప్రాజెక్టు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నిజాంకాలంలో అప్పటి ప్రభువు మండలంలోని ఆలేరువాగుపై నిర్మించిన పోచారం ప్రాజెక్టుకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరద వచ్చింది. సుమారు 103 ఏళ్ల క్రితమే పోచారం ప్రాజెక్టును 70 వేల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా డిజైన్ చేసి నిర్మించారు. కానీ ఈ ఏడాది కురిసిన భారీవర్షాల కారణంగా లక్షా 82వేల క్యూసెక్కుల వరదను తట్టుకొని నిలబడింది. ఈ ఏడాది కురిసిన భారీవర్షాలతో ఆయకట్టు కింద వానాకాలం పంటలసాగు మొదలైనప్పటి నుంచి పంటలు కోతదశకు చేరే వరకు సుమారు రెండునెలలుగా ప్రాజెక్టు అలుగు పైనుంచి దిగువకు వరద నీరు ప్రవహిస్తూనే ఉంది.

మంజీరలోకి 26 టీఎంసీలు..

పోచారంప్రాజెక్టు అలుగు పైనుంచి వరద దిగువకు ప్రవహిస్తూ 26 టీఎంసీల నీరు పోచారం పెద్దవాగు ద్వారా మంజీరలోకి చేరింది. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో వరద నీరు అవుట్ ఫ్లోగా వెళ్లలేదు. 1917–22 మధ్యకాలంలో అప్పటి నిజాం ప్రభువు అలీ నవాబ్ జంగ్ బహదూర్ 27.11లక్షలు వెచ్చించి 2.423 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండేలా ఆలేరు వాగుపై 1.7 కిలోమీటర్ల పొడవుతో, 21అడుగుల ఎత్తుతో పోచారం ప్రాజెక్టును నిర్మించారు. దీంతోపాటు ప్రాజెక్టులోని నీరు గేట్ల ద్వారా ఆయకట్టుకు చేరేలా 58 కిలోమీటర్ల పొడవుతో ప్రధానకాలువను నిర్మించారు. కాలువకు 73 డిస్ట్రిబ్యూటరీలను నిర్మించారు. 103 ఏళ్లలో ఎన్నడు కూడా ఈ స్థాయిలో ఇన్‌ఫ్లోగా రాలేదు. ఈ ఏడాది ప్రాజెక్టు ఎగువన కురిసిన భారీవర్షాల కారణంగా 28.020 టీఎంసీల నీరు ఇన్‌ఫ్లోగా రాగా 25.933క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లోగా దిగువకు వెళ్లింది. కాగా ఈ ఏడాది ఆయకట్టు పరిధిలో వానాకాలం పంటలసాగు కోసం ప్రాజెక్టు నుంచి కేవలం 0.172 టీఎంసీల నీటిని అధికారులు ప్రధాన కాలువలోకి విడుదల చేశారు. పోచారం ప్రాజెక్టు అలుగు పైనుంచి దిగువకు ప్రవహిస్తూ గత ఆగస్టు 16న 12 వేల క్యూసెక్కులతో మొదలైన అవుట్ ఫ్లో నేటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు అలుగుపై నుంచి 742 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.

వడ్ల పొట్టుకు భలే డిమాండ్

- ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలకు వడ్ల ఊకే ఆధారం
- రైస్ మిల్లులు నడవక వడ్ల పొట్టు కొరత
- భారీ వాహనాల్లో ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- స్థానికంగా కొరతతో ఇబ్బందులు



బీబీపేటలో వడ్ల పొట్టును సంచుల్లో నింపుతున్న కూలీలు

బీబీపేట: ఇటుక బట్టీలు, హోటళ్లు, కోళ్ల ఫారాలు ఇలా అనేక వాటిలో వడ్ల పొట్టును వాడాల్సిందే. అయితే ప్రస్తుతం వడ్ల పొట్టు లేకపోవడం, ఉన్న కాస్త పొట్టు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడంతో స్థానికంగా కొరత ఏర్పడుతోంది. దీనికి తోడు వర్షాకాలం సీజన్‌లో రావాల్సిన వడ్లు ఇంకా రైస్ మిల్లులకు చేరకపోవడంతో రైస్ మిల్లులు నడవడం లేదు. దీంతో అందుబాటులో ఉన్న కొంత ఊకను సైతం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

స్థానికంగా కోళ్ల ఫారాలు..

బీబీపేట మండలంలో సుమారు 2 లక్షలకు పైగా కోళ్లను పెంచే సామర్థ్యం ఉన్న ఫారాలు ఉన్నాయి. 2 లక్షల కోళ్లను పెంచేందుకు సుమారు 60 టన్నుల వడ్లపొట్టు అవసరమవుతుంది. ప్రతి రెండు నెలలకోసారి 60 టన్నుల ఊక అవసరం ఏర్పడడంతో స్థానికంగా కొరత ఏర్పడుతోంది. పది వేల కోళ్లు ఉండే ఫామ్‌కి సుమారు 3 టన్నుల కన్నా ఎక్కువే ఊక అవసరం పడుతుంది. ఒక కోళ్ల ఫామ్ రైతు ప్రతి రెండు నెలలకోసారి ఊకను తీసుకుపోవాల్సిన వస్తుంది. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో లారీలు రావడంతో వారికి విక్రయిస్తున్నారు. అలాగే చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీలకు ఊక అవసరం ఉంటోంది.

డిమాండ్ ఎక్కువ

రైస్ మిల్లులు పూర్తిగా నడవకపోవడంతో ప్రస్తుతం ఊకకు డిమాండ్ పెరిగింది. ఒక్కో రైస్ మిల్లు రోజంతా నడిస్తే సుమారు 3 నుంచి నాలుగు టన్నుల ఊక మాత్రమే వస్తుంది. అది ఒక లారీ నింపడానికి కూడా సరిపోవడం లేదు. రెండు రోజులు నడిస్తే తప్ప లారీ నిండే అవకాశం లేదు. అలాగే వడ్ల పొట్టు తక్కువగా ఉండడంతో ధర కూడా పెంచుతున్నారు. ప్రస్తుతం రూ. 4 వేల నుండి రూ. 5 వేల వరకు ఒక టన్నుకు అమ్ముతున్నారు. ఒక్కోసారి ఊక కొరత ఉండడంతో రూ. 6 వేల వరకు ధర పెరుగుతోంది. దీంతో కోళ్ల ఫారాల రైతులపై ఆర్థికభారం పడుతోంది. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేయడంతో కొరత ఏర్పడి ఆ ప్రభావం స్థానికులపై పడుతోంది.

వివాదాస్పదమైన నీటికుండీ తొలగింపు

- వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేసిన వ్యక్తి
- భిక్కనూరు మండలం గుర్జకుంటలో ఘటన



గుర్జకుంటలో వాటర్ ట్యాంక్ ఎక్కి ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న గ్రామస్తులు

భిక్కనూరు: గ్రామస్తులు నిర్మించిన నీటి కుండీ తన తన ఇంటి ముందు ఉందని ఓ వ్యక్తి దాన్ని తొలగించాడు. దీంతో గ్రామస్తులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేయగా సదరు వ్యక్తి నీటిట్యాంక్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన మండలంలోని గుర్జకుంట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కుంట ప్రభాకర్ రెడ్డి ఆరు నెలల క్రితం 450 గజాల ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నాడు. ఆ స్థలం ముందు 30 ఏళ్ల క్రితం గ్రామస్తులు పశువుల కోసం నిర్మించిన నీటికుండీ ఉంది. ఆ కుండీని ప్రభాకర్‌రెడ్డి కొన్ని నెలల క్రితం తొలగించగా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్టోబర్ 10వ తేదీ నాటికి కుండీని యథాస్థానంలో తిరిగి నిర్మిస్తానని అతడు గ్రామస్తులకు తెలుపడంతో వారు శాంతించారు. అయితే గడువు దాటినా కుండీ నిర్మించలేదని ప్రభాకర్‌రెడ్డిని గ్రామస్తులు ప్రశ్నించారు. తామే నిర్మిస్తామని మంగళవారం పనులు ప్రారంభించడంతో ప్రభాకర్ రెడ్డి గుళికల మందు తీసుకుని సమీపంలోని వాటర్‌ట్యాంక్ ఎక్కాడు. పనులు నిలిపివేయకుంటే గుళికలు మింగుతానని హెచ్చరించాడు. దీంతో గ్రామస్తులు పనులు నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై ఆంజనేయులు గ్రామానికి చేరుకుని ఫోన్‌లో ప్రభాకర్ రెడ్డితో మాట్లాడి సముదాయించాడు. పలువురు గ్రామస్తులు వాటర్ ట్యాంక్ మీదకు చేరుకుని ప్రభాకర్‌రెడ్డిని కిందికి తీసుకుని వస్తుండగా కొన్ని గుళికలను ప్రభాకర్‌రెడ్డి నోట్లో వేసుకున్నాడు. పక్కనే ఉన్న వారు అతడిని కిందకు తీసుకురాగా, వైద్య పరీక్షల నిమిత్తం ఎస్సై కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రభాకర్‌రెడ్డి వాటర్ ట్యాంక్‌లో గుళికలు కలిపి ఉండొచ్చనే అనుమానంతో నీటిని ఖాళీ చేయించి ట్యాంకును శుభ్రం చేయించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



కామారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టులను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి హీరాలాల్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అండర్-17 బాలుర, బాలికల జట్టులను క్రీడాకారులను ప్రకటించారు. నిజామాబాద్ నుంచి 14 మంది, కామారెడ్డి నుంచి 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు స్వామి గౌడ్, అశోక్, రాజా గౌడ్, బాలయ్య, లక్ష్మణ రాథోడ్, సతీష్, శేఖర్, శ్రీనివాస్, మధు తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ..



భిక్కనూరు: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఫరీదుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని చింతల స్పందన ఎంపికైందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 18వరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో స్పందన పాల్గొంటుందన్నారు. స్పందనను పాఠశాల హెచ్‌ఎం మనోహర్‌రావు, పాఠశాల చైర్మన్ సౌజన్య ఉపాధ్యాయులు అభినందించారు.

వరి పొలాల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): గండివేట్ శివారులో మంగళవారం క్షేత్ర స్థాయిలో వరి పొలాలను పరిశీలించినట్లు ఏవో రాజలింగం తెలిపారు. వరి పొలాల్లో మానిపండు తెగులు, ఆకుల పై పసుపు పచ్చ మచ్చలున్నట్లు గుర్తించామన్నారు. మోతాదుకు మించి యూరియా మందును వాడకం వల్ల ఈ తెగులు ఆశిస్తుందన్నారు. సంబంధిత రైతులకు సస్యరక్షణ చర్యల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు.

స్కూల్ బ్యాగులు, ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి 35వ వార్డులోని దత్తాత్రేయ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత రాజేశ్వర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజుపాటిల్, అంగన్వాడీ టీచర్ రాజేశ్వరి, పోచయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈ-కేవైసీ హాజరు

- జాబ్‌కార్డులతో ఆధార్ అనుసంధానం
- పని ప్రదేశంలో ఐరిస్ నమోదు

పెర్కిట్(ఆర్మూర్)/కమ్మర్‌పల్లి: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కూలీల హాజరును ఈ-కేవైసీతో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేక యాప్ జాతీయ మస్టర్ పర్యవేక్షణ వ్యవస్థ(ఎన్‌ఎంఎంఎస్)ను తీసుకురాగా, కూలీల వివరాలు, ఈ-కేవైసీ నమోదు చేయడం తప్పనిసరి చేసింది. ఈ విధానంలో కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయడంతోపాటు ఒకరి బదులుగా మరొకరు పనులకు రాకుండా ఐరీస్ నమోదు తప్పనిసరి చేశారు.



చౌట్‌పల్లిలో ఉపాధి కూలీకి ఈ-కేవైసీ చేస్తున్న సిబ్బంది

ఈకేవైసీ పూర్తి చేసుకోని కూలీలకు పనులు కల్పించే అవకాశం ఉండదు. ఒకరి జాబ్‌కార్డుపై మరొకరు పని చేసే అవకాశం ఇక ఉండదని అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు ఆస్కారం లేకుండా..

గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో చేపట్టనున్న పనుల వివరాల నమోదుకు ఈ-ఎంబీ (ఎలక్ట్రానిక్ మెజర్‌మెంట్ బుక్) విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చారు. పనిచేసే ప్రాంతాల వివరాలను గుర్తించిన తర్వాత పనులు కొలతలను ఎంబీ రికార్డు చేసిన అనంతరం ఆన్‌లైన్‌లో ఈ-ఎంబీ చేయాల్సి ఉంటుంది. వివరాలను ప్రత్యేక యాప్‌లో అనుసంధానం చేస్తే ఆయా పనులను ఉన్నతాధికారులు ఎక్కడి నుంచయిన పరిశీలించవచ్చు. దీంతో ఒకేచోట రెండు పనులు చేయడం వంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదు. నూతన సంస్కరణలతో పనులు పారదర్శకంగా కొనసాగడంతోపాటు, కూలీలకు కూలి చెల్లింపులు న్యాయంగా జరుగుతాయి.

నకిలీలకు తెర..

గతంలో పని ప్రదేశం వద్ద కూలీల హాజరును నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేసేవారు. కానీ కొందరు క్షేత్ర సహాయకులు, మేట్‌లు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. సామాజిక తనిఖీల్లో అక్ర మాలు బయటపడుతుండటంతో వీటిని అరికట్టేందుకు కేంద్రం ఎన్‌ఎంఎంఎస్ యాప్ తీసుకువచ్చింది. ఈ యాప్ కూడా దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించింది. దీంతో నకిలీల హాజరు అరికట్టేందుకు ఈ-కేవైసీ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. దీని ప్రకారం సెల్‌ఫోన్‌లో ఫొటోలను తీసి అప్‌లోడ్ చేస్తారు. నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తారు. ఒకే వ్యక్తి రెండు ఫొటోల్లో ఉంటేనే కూలీ డబ్బులు అందుతాయి. జిల్లాలో మొత్తం 2,40,605 లక్షల కూలీలు ఉండగా, ఇప్పటి వరకు 1,27,807 మంది కూలీలకు ఈ-కేవైసీ పూర్తయింది.

ఈ-కేవైసీ పూర్తికి చర్యలు..



ఆర్మూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న కూలీల వివరాలను ఈ-కేవైసీ చేయిస్తున్నాం. ఇప్పటికీ దాదాపు 50 శాతంపైనే ఈకేవైసీ పూర్తి చేశాం. గ్రామాల్లోని ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు నూతన విధానంపై అవగాహన కల్పించాం. నకిలీ మస్టర్లకు తావులేకుండా అర్హులైన కూలీలందరికి వంద రోజుల పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

–సురేష్, ఏపీవో, ఆర్మూర్

వారంలోగా పూర్తి చేస్తాం..



జిల్లాలో కూలీల ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. సాధ్యమైనంత త్వరగా నమోదు పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని ఏపీవోలను ఆదేశించాం. ఈ-కేవైసీ విధానానికి కూలీలు పూర్తిగా సహకరించాలి. జిల్లాలో మొత్తం 2,40,605 లక్షల కూలీలు ఉండగా, ఇప్పటివరకు 1,27,807 మంది కూలీలకు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయింది.

–సాయాగౌడ్, పీడీ, డీఆర్డీవో, నిజామాబాద్

మన చేతుల్లోనే ఆరోగ్యం

- తినేముందు చేతులు శుభ్రంగా కడుక్కుంటేనే ఎంతో మేలు
- నేడు గ్లోబల్ హ్యాండ్ వాష్‌డే



కమ్మర్‌పల్లి: మనం ఏం తిన్నామో కాదు, ఎలా తిన్నామో అనేదే ముఖ్యం. భోజనం తినడానికి ముందు, బాత్‌రూమ్ వెళ్లివచ్చిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం ఎంతో మేలు. ముఖ్యంగా తల్లిదండ్రులు చిన్నారులకు తప్పకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవడం అలవాటు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ చేతులు శుభ్రం చేసుకోవడంపై పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది. ఏటా అక్టోబరు 15న విశ్వవ్యాప్తంగా చేతుల పరిశుభ్రత దినోత్సవం(గ్లోబల్ హ్యాండ్ వాష్ డే)గా పాటిస్తున్నారు.

శుభ్రంగా లేకుంటే..

మనిషి ఆరోగ్యం శుభ్రతపై ఆధారపడి ఉంటుంది. మురికిగా ఉన్న చేతులతో భోజనం చేస్తే వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, పచ్చకామెర్లు వంటి జబ్బులు వస్తాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చాలా పనులు చేస్తుంటాము. ఈక్రమంలో మనం తాకిన ప్రతి వస్తువులపైన కనిపించని క్రిములుంటాయి. ఆయా వస్తువులను తాకినపుడు మన చేతికి అంటుకొంటాయి. చేతుల్లో కంటికి కనిపించని వైరస్‌లు లక్షల్లో దాగిఉంటాయి. అవే చేతులను కళ్లు, నోరు, ముక్కు దగ్గర పెట్టినపుడు బ్యాక్టీరియా, వైరస్ మన శరీరంలోకి చేరుతుంది. చేతులను నీటితో శుభ్రం చేసుకోకుండా ఆహారం తీసుకుంటే చేతుల్లోని క్రిములు నోటిద్వారా శరీరంలోకి చేరుతాయి.

అవగాహన కల్పించాలి..

చేతుల శుభ్రతపై పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం అరచేతుల్లో ఎక్కువ తేమ ఉండటంతోపాటు కొన్ని లక్షల సూక్ష్మజీవులు ఉంటాయి. ఆ చేతులతోనే తినేయడంవల్ల అనేక రోగాల్ని చేతులతో ఆహ్వానించినట్టే. తరచు చేతులు శుభ్రం చేసుకోవడంవల్ల 80 శాతం రోగాలు మన శరీరానికి దూరంగా ఉంటాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొంది. అందుకే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ముందు విద్యార్థులకు ఈ విషయాన్ని తెలియజేయాలి. ఆహారం తీసుకునేముందు సబ్బు లేదా యాంటీ బాక్టీరియల్ లోషన్, సానిటైజర్‌తో చేతులను శుభ్రం చేసుకోవాలి.

సేంద్రియ ఎరువుల ద్వారా పంటలను పండించాలి



ఎర్రాపహాడ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీనివాస్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు పండించాలని సీనియర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ అన్నారు. ఎర్రాపహాడ్ రైతు వేదికలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్, రాజేంద్రనగర్, మాలుతుమ్మెద వ్యవసాయ కళాశాలల ఆధ్వర్యంలో రైతు సదస్సు,వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేల సంరక్షణ,ఆరోగ్యం,చేయవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.అనంతరం ఏవో నర్సింలు మాట్లాడుతూ..యూరియాను ఎక్కువ వాడడం వల్ల కలిగే నష్టాలు, శనగ పంట విత్తన శుద్ధి, తదితర విషయాల గురించి వివరించారు. డాక్టర్ అనీల్, ఏవో నర్సింలు, ఏడీఏ సుధామాధురి, రైతులు పాల్గొన్నారు.

బాన్సువాడలో సినిమా షూటింగ్ సందడి



మాట్లాడుతున్న డైరెక్టర్, నిర్మాతలు

బాన్సువాడ: బాన్సువాడలో మంగళవారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. పంపారీస్ సాగ (హిందీ) సినిమాలో హీరో-హీరోయిన్లుగా జుబేర్ ఖాన్, అనుషాల నటిస్తుండగా డైరెక్టర్ జుబేర్ ఖాన్, నిర్మాత, రైటర్ అబ్దుల్ అద్నాన్ (బాన్సువాడ) ఉన్నారు. గతంలో పాత బాన్సువాడలో దివంగత వ్యాపారవేత్త విఠల్‌రెడ్డి స్వగృహంలో ఫిదా సినిమా షూటింగ్ చేసిన విషయం తెలిసింది. అదే ఇంట్లో ప్రస్తుతం పంపారీస్ సాగ సినిమా షూటింగ్ కొనసాగుతుంది. ముంబైకి చెందిన హీరో హీరోయిన్లు, మిగత నటీనటులు షూటింగ్‌కు రావడంతో బాన్సువాడ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి తిలకించారు.

రోడ్లు, కుంటల మరమ్మతులకు నిధులు మంజూరు



పనులు ప్రారంభిస్తున్న బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు: వరదలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, కుంటలు, కాల్వల మరమ్మతు పనులకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలో ఇటీవల వరదలకు తెగిన దాసనమ్మ కుంట కట్ట మరమ్మతు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం వరదలను ప్రత్యేక విపత్తుగా భావించి నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభింపజేసిందన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, నేతలు దయాకర్‌రెడ్డి, నీల అంజయ్య, సాజీద్, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇల్లు మంజూరు చేయండి సారూ..

రాజంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రాజంపేట గ్రామానికి చెందిన తోడెంగల రాజమణి, రాజయ్యల పురాతన ఇంటి పైకప్పు పాక్షికంగా కూలింది. దీంతో ఇంట్లో వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. దీంతో కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండటంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో పాలుపోవడం లేదని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసి తమను ఆదుకోవాలని కోరారు.

పేకాడుతున్న 9మంది అరెస్టు

పిట్లం(జుక్కల్): మండలంలోని చిల్లర్గి గ్రామంలో పేకాడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4 వేల నగదును, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

రేషన్ డీలర్ల బతుకు భారంగా మారింది

కామారెడ్డి రూరల్: తెలంగాణలోనే కామారెడ్డి జిల్లాను రేషన్ బియ్యం పంపిణీలో మొదటి స్థానంలో ఉంచిన రేషన్ డీలర్ల బతుకు భారంగా మారిందని కామారెడ్డి జిల్లా లీగల్ అడ్వైజర్ ముస్తాక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన ఐదు నెలల నుంచి సెంట్రల్ కమిషన్, సెప్టెంబర్, అక్టోబర్ రెండు నెలల నుంచి రాష్ట్ర వాటా కేంద్రం వాటాకు సంబంధించిన డీలర్ కమిషన్ రూపాయలు సుమారు 7 నెలల నుంచి విడుదల కాలేదన్నారు. రేషన్ షాప్ రెంట్ కట్టుకోలేక, గుమస్తాలకు జీతం ఇవ్వలేని పరిస్థితుల్లో డీలర్లు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రేషన్ డీలర్లకు రావలసిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన భోజనం అందేలా చూడాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని మండల ప్రత్యేకధికారి కిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం బేగంపూర్ తండా ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, కార్యదర్శి ఇందల్, ఉపాధ్యాయులు అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో రెండు రోజులు..

మాక్లూర్: మాణిక్‌భండార్ వద్ద సోమవారం పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో అడవి మామిడిపల్లికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు మంగళవారం అతడిని కోర్టుకు తరలించగా, జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్షవిధించినట్లు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య



పిట్లం(జుక్కల్): ఓ వివాహిత మంజీర నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా..బాన్సువాడ డివిజన్ తాడ్కోలు గ్రామానికి చెందిన చిన్న నాగమణి (52) గత మూడేళ్లుగా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. చికిత్స చేయించినప్పటికీ వ్యాధి తగ్గకపోవడంతో జీవితం మీద విరక్తిచెందింది. ఈక్రమంలో బుధవారం రాత్రి ఆమె ఇంట్లో నుంచి బయటకు వచ్చి బొల్లపల్లి గ్రామ శివారులోని మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు.

ఆటో డ్రైవర్ ..



నితిన్ (ఫైల్)

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు మంగళవారం తెలిపా రు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన తిప్పబోయిన నితిన్(21)ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం ఉదయం నితిన్ ఆటో కిరాయికి వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి, బయలుదేరాడు. మధ్యాహ్నం తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన వ్యవసాయ పొలం వద్ద మామిడి చెట్టుకు ఉరివేసుకుంటున్నట్లు చెప్పి, చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నితిన్ గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసగా మారాడని సమాచారం. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఆర్మూర్‌లో మహిళ దారుణ హత్య

- వివాహేతర సంబంధమంటూ ఘాతుకానికి పాల్పడిన భర్త
- నిందితుడి అరెస్టు



మమత (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న భార్యను భర్త హత్య చేసిన ఘటన ఆర్మూర్‌లో వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన జగదీష్ 40 సంవత్సరాల క్రితం బతుకు దెరువు కోసం ఆర్మూర్‌కు వలస వచ్చాడు. కొన్నేళ్ల క్రితం మెదక్ జిల్లాకు చెందిన మమతను వివాహం చేసుకొని మామిడిపల్లి లో నివసిస్తున్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. జగదీష్ ఒక సామిల్‌లో పనిచేస్తుండగా, మమత నిజామాబాద్‌లో గణపతి విగ్రహాలకు మెరుగులు దిద్దే పనిచేస్తుంది. కాగ మమత మామిడిపల్లికి చెందిన ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందన్న విషయం తెలిసిన భర్త పలుమార్లు వారించాడు. ఈ విషయమై మంగళవారం వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా దంపతులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అనంతరం పనికి వెళ్లిన జగదీష్ ఇంటికి వచ్చేసరికి భార్య, ప్రియుడు కలిసి ఉండటాన్ని చూసి తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. విచక్షణ కోల్పోయి, వంట గదిలో ఉన్న కత్తితో భార్య గొంతును కోసి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటన స్థలాన్ని ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్‌హెచ్‌వో స్యతనారాయణగౌడ్, ఎస్సైలు రమేష్, వినయ్ సందర్శించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయినట్లు ఎస్ఐ మురళి తెలిపారు. వివరాలు ఇలా.. మాచారెడ్డి మండలం భవానీపేటకు చెందిన శ్రీకాంత్, తాడ్వాయి మండలంలోని చందాపూర్‌కు చెందిన బొర్రశేఖర్ బైక్‌పై ఎర్రాపహాడ్ నుంచి కామారెడ్డి వైపు వెళుతున్నారు. లింగంపేట్ మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన సాయిలు అనే వ్యక్తి కారులో కామారెడ్డి నుంచి ఎల్లారం వైపు వెళుతున్నాడు. తాడ్వాయిలో సాయిలు తన కారుకు ఇండికేటర్ వేసుకొని కుడి వైపు టర్న్ చేయగా, బైక్ కారుకు ఢీకొట్టింది. దీంతో బైక్‌ను నడుపుతున్న శ్రీకాంత్, శేఖర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి ఒకరు గల్లంతు



ఎల్లారెడ్డి: చేపలు పట్టడానికి చెరువుకు వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతైన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని బాలాజీ నగర్ ప్రాంతానికి చెందిన రుడావత్ గణేశ్ (48) మంగళవారం ప ట్టణ శివారులోని పెద్ద చెరువులో చేపలు పట్టడానికి ఇంటి నుంచి బయలుదేరాడు. చెరువులోకి దిగిన అతడు ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగిపోయాడు. అతడి మృతదేహం కోసం అగ్నిమాపక సిబ్బంది సహకారంతో పోలీసులు సాయంత్రం వరకు ప్రయత్నించినా చీక టి పడటంతో సాధ్య పడలేదు. మృతదేహం కోసం బుధవారం ఉదయం గాలింపులు చేపడతామ ని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కొడుకు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

కాలువలో నీటమునిగి ఒకరు మృతి



భానుప్రసాద్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్):కాలకృత్యాలు తీర్చుకునేందు నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి వెళ్లిన ఓ వ్యక్తి నీటమునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల భానుప్రసాద్ (22) సోమవారం సాయంత్రం తుంకిపల్లి గ్రామం నుంచి మహమ్మద్ నగర్ గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. బూర్గుల్ గ్రామ శివారులో ని నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్ట వద్ద బహి ర్భుమి కోసం వెళ్లాడు. అనంతరం ప్రధాన కాలువ నీటిలో కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాద వశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. కాలువలో గా లింపు చేపట్టగా మంగళ వారం మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చైన్‌స్నాచింగ్‌కు యత్నం.. నిందితుడికి దేహశుద్ధి



బాధితురాలు సునీత

శంకర్‌పల్లి: గ్రామంలోని ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును చోరీకి యత్నించిన నిందితుడిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం సవర్గాన్‌కు చెందిన కుంబారే సిద్ధారెడ్డి, సునీత దంపతులు వారి కుమారుడు, కుమార్తెతో కలిసి నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం శంకర్‌పల్లికి వచ్చారు. పట్టణంలో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొన్నాళ్లుగా ఈ దంపతుల కదలికలను గమనిస్తున్న దుండగుడు మంకీ క్యాప్ ధరించి హఠాత్తుగా ఇంట్లోకి చొరబడ్డాడు. సునీత కళ్లలో కారం చల్లి.. క్రికెట్ బ్యాట్‌తో దాడి చేసి మెడలోని పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. అక్కడే కార్ వాషింగ్ సెంటర్ నిర్వహిస్తున్న ప్రవీణ్ గమనించి వెంటనే పట్టుకుని తనిఖీ చేశాడు. బ్యాగులో కారం పొడి, మంకీక్యాప్, పుస్తెల తాడు లభించింది. అప్పటికే సునీత భర్తకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న సిద్ధారెడ్డి దుండగుడు టిఫిన్ సెంటర్ ఎదురుగా అద్దెకు ఉండే వాసు(45)గా గుర్తించాడు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన వాసు డైలీ ఫైనాన్స్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు చేవెళ్ల కోర్టులో హాజరు పరిచారు. రిమాండ్ నిమిత్తం చర్లపల్లి జైలుకి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని గుడిపాటి చంద్రశేఖరశర్మ ఇటీవల తన ఇంటికి తాళం వేసి, భార్యతో కలిసి ఊరికి వెళ్లాడు. మంగళవారం వారి బంధువులు చంద్రశేఖరశర్మ ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉండటంతో శర్మకు ఫోన్‌లో సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చిచూడగా ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 8తులాల బంగారం అభరణాలు, 11 తులాల వెండి అభరణాలు. 11 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూతురిపై అత్యాచారం చేసిన నిందితుడికి ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం/బాన్సువాడ: కన్న కూతురుపై అత్యాచారం చేసిన కేసులో కామారెడ్డి కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలు ఇలా.. బాన్సువాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని ఈ ఏడాది సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వెళ్లింది. తిరిగి పాఠశాల ప్రారంభం అయ్యాక మూడు రోజులు ఆలస్యంగా వచ్చింది. ఈవిషయమై విద్యార్థినిని హెచ్‌ఎం విజయ భారతి ఆరా తీశారు. సెలవుల్లో ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న సమయంలో తనపై తండ్రి లైంగిక దాడికి పాల్పడినట్లు విద్యార్థిని చెప్పడంతో హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని కోణాల్లో విచారణ జరిపిన పోలీసులు కన్న కూతుతుపై అత్యాచారానికి పాల్పడిన తండ్రిపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ మంగళవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏపీపీ శేషు, బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి, లైజనింగ్ అధికారి రామేశ్వర్ రెడ్డి, పీసీ సాయిలులను ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. ఈ కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఏడాది లోపే తీర్పు వచ్చిందని పేర్కొన్నారు.

ఆత్మహత్య కేసులో ఒకరి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన చింతకుంట రవి అనే వ్యక్తిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా.. బిచ్కుందకు చెందిన ఓ మహిళతో రవి వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈక్రమంలో సదరు మహిళ వద్ద నుంచి కొంత డబ్బు, బంగారం అవసరం నిమిత్తం అతడు తీసుకున్నాడు. మహిళ డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగగా శారీరకంగా, మానసికంగా హింసించాడు. దీంతో మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.